ముగిసిన ఎంసెట్ రాతపరీక్షలు

- 94.11 శాతం అభ్యర్థుల హాజరు
- నేడు ఇంజినీరింగ్ విభాగం ప్రాథమిక కీ విడుదల
- 17 వరకు అభ్యంతరాల స్వీకరణ



ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో ఎంసెట్ రాతపరీక్షలు ఆదివారంతో ముగిశాయి. ఈ నెల 10 నుంచి ఆన్‌లైన్‌లో ఈ పరీక్షలు ప్రారంభమైన విషయం తెలిసిందే. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ప్రశాంతంగా ఎంసెట్ రాతపరీక్షలు ముగియడంతో ఉన్నత విద్యామండలి, ఎంసెట్ అధికారులు ఊపిరిపీల్చుకున్నారు. ఇటీవల కాలంలో టిఎస్‌పిఎస్‌సి ప్రశ్నాపత్రాల లీకేజీ, పదోతరగతి పత్రాలు పరీక్షా కేంద్రాల నుంచి బయటికి రావడం వంటి ఘటనలు చోటుచేసుకున్నాయి. అయితే ఆ ప్రభావం ఎంసెట్‌పైనా ఉంటుందని అందరూ భావించారు. కానీ విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పరీక్షలు ముగియడంతో అధికారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ మేరకు ఎంసెట్ కన్వీనర్ బి డీన్‌కుమార్, కోకన్వీనర్ కె విజయకుమార్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఎంసెట్‌కు 3,20,683 మంది అభ్యర్థులు దరఖాస్తు చేశారని, వారిలో 3,01,789 (94.11 శాతం) మంది అభ్యర్థులు హాజరయ్యారని తెలిపారు. 18,894 మంది గైర్హాజరయ్యారని వివరించారు. తెలంగాణ నుంచి 2,48,479 మంది దరఖాస్తు చేస్తే, 2,35,918 (94.94 శాతం) మంది పరీక్ష రాశారని పేర్కొన్నారు. 12,561 మంది హాజరు కాలేదని తెలిపారు. ఎపి నుంచి 72,204 మంది దరఖాస్తు చేయగా, 65,871 (91.23 శాతం) మంది పరీక్ష రాశారని వివరించారు. 6,333 మంది గైర్హాజరయ్యారని పేర్కొన్నారు. ఐదు రోజులపాటు నిర్వహించిన ఈ పరీక్షల్లో ముగ్గురు అభ్యర్థులపై మాల్‌ప్రాక్టీస్ కేసులు నమోదయ్యాయని తెలిపారు. మొదటి రోజు నుంచి చివరి వరకు ఈ పరీక్షలు జరుగుతున్న తీరును ఉన్నత విద్యామండలి చైర్మెన్ ఆర్ లింబాద్రి, జెఎన్‌టియు హైదరాబాద్ విసి కట్టా నర్సింహారెడ్డి పర్యవేక్షించారు. ఎంసెట్ ఇంజినీరింగ్ విభాగం రాతపరీక్షలను ఈ నెల 12 నుంచి 14వ తేదీ వరకు తేదీల్లో నిర్వహించామని డీన్‌కుమార్ తెలిపారు. సోమవారం సాయంత్రం ఎనిమిది గంటలకు ప్రాథమిక కీతోపాటు అభ్యర్థుల రెస్పాన్స్ షీట్‌ను డౌన్‌లోడ్ చేసుకునేందుకు అవకాశముందని సూచించారు. ప్రాథమిక కీపై ఏమైనా అభ్యంతరాలుంటే ఈ నెల 17వ తేదీ సాయంత్రం ఎనిమిది గంటల వరకు సమర్పించొచ్చని కోరారు. ఎంసెట్ వెబ్‌సైట్ ద్వారానే అభ్యంతరాలను స్వీకరిస్తామని తెలిపారు. ఇతర పద్ధతుల్లో స్వీకరించబోమని స్పష్టం చేశారు.

ప్రపంచంలో తల్లిని మించిన యోధులు లేరు

- మంత్రి హరీశ్ రావు

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

ప్రపంచంలో తల్లిని మించిన యోధులు మరెవ్వరూ లేరని రాష్ట్ర మంత్రి తన్నీరు హరీశ్‌రావు ఆదివారం ట్విట్టర్ వేదికగా తెలిపారు. అలాంటి తల్లిని సంరక్షించుకునేందుకు తమ ప్రభుత్వం అనేక కార్యక్రమాలు అమలు చేస్తోందని పేర్కొన్నారు. బిడ్డ కడుపులో పడగానే కెసిఆర్ న్యూట్రిషన్ కిట్, బిడ్డ పుట్టగానే కెసిఆర్ కిట్, బాలింతలు, గర్భిణులకు పౌష్ఠికాహారం అందించేందుకు ఆరోగ్య లక్ష్మి, ఆరోగ్య సమస్యలు ముందుగానే గుర్తించి సత్వర చికిత్స అందించేందుకు ఆరోగ్య మహిళ, వ్యాధి నిరోధకత పెంచేలా వంద శాతం ఇమ్యునైజేషన్, ఇంటి నుంచి ఆస్పత్రికి, ఆస్పత్రి నుంచి ఇంటికి ఉచిత ప్రయాణ సేవల కోసం అమ్మ ఒడి వాహనాలు, రాష్ట్ర వ్యాప్తంగా 28 మాతా శిశు సంరక్షణ కేంద్రాలు.. ఇలా అనేక ఏర్పాట్లతో తల్లులను సంరక్షించుకునేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు.

తద్వారా మాతృమరణాలను తగ్గించటంలో దేశంలోనే రాష్ట్రం మూడో స్థానంలో నిలిచిందని పేర్కొన్నారు. ఇది తల్లులు, ఆడ బిడ్డల సంరక్షణ పట్ల కెసిఆర్ ప్రభుత్వానికున్న చిత్తశుద్ధి అని పేర్కొన్నారు. మాతృ మూర్తులందరికీ ప్రపంచ తల్లుల దినోత్సవం సందర్భంగా మంత్రి శుభాకాంక్షలు తెలిపారు.



హరిత విప్లవ స్ఫూర్తిదాత అంబేద్కర్

- 16న సిఎం కెసిఆర్‌కు ధన్యవాద సభ
- ఎంపి జి సంతోష్‌కుమార్

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

డాక్టర్ బిఆర్ అంబేద్కర్ హరిత విప్లవ స్ఫూర్తిదాత అని రాజ్యసభ సభ్యులు, గ్రీన్ ఇండియా చాలెంజ్ ఫౌండర్ చైర్మెన్ జోగినపల్లి సంతోష్‌కుమార్ కొనియాడారు. ఆయన న్యాయ శాఖ మంత్రిగా ఉన్న సమయంలో తనను కలవాలంటే ఒక మొక్క నాటి రావాలని పిలుపునిచ్చారని గుర్తుచేశారు. ఆయన ఆలోచనల మేరకు అందరూ మొక్కలు నాటి సంరక్షించాలని, హరిత భారతావనికి కృషిచేయాలని పిలుపునిచ్చారు. హైదరాబాద్‌లో 125 అడుగుల అంబేద్కర్ భారీ విగ్రహం నెలకొల్పటం, సచివాలయానికి అంబేద్కర్ పేరు పెట్టిన సందర్భంగా సిఎం కెసిఆర్‌కు ధన్యవాద సభను ప్రజా, ఉద్యోగ, కుల సంఘాల ఆధ్వర్యంలో ఈ నెల 16న ఇందిరాపార్కు వద్ద నిర్వహించనున్నట్టు తెలిపారు. ఆదివారం హైదరాబాద్‌లోని ప్రగతిభవన్‌లో దానికి సంబంధించిన పోస్టర్‌ను సంతోశ్‌కుమార్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఫుడ్ కార్పొరేషన్ చైర్మెన్ రాజీవ్ సాగర్, గ్రీన్ ఇండియా ఛాలెంజ్ కో ఫౌండర్ రాఘవేంద్ర యాదవ్, ప్రజాసంఘాల జెఎసి చైర్మెన్ గజ్జలకాంతం, ప్రయివేటు ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు గంధం రాములు, డిఎన్‌టి ఎంబిసి, పూసల సంఘం రాష్ట్ర అధ్యక్షులు కోల శ్రీనివాస్, టిపియుఎస్ కార్మిక విభాగం అధ్యక్షులు గంగాధర్, వడ్డెర కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు రామకృష్ణ, ఐటి వింగ్ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షులు కట్ట రవికుమార్ గుప్తా, ప్రయివేటు ఉద్యోగుల సంఘం రాష్ట్ర కార్యదర్శి వేముల భాస్కర్, సోషల్ మీడియా ఇన్‌చార్జి మోహన్ నాయక్, ఒయుజెఎసి నాయకులు డాక్టర్ సంజీవ్ నాయక్, శివకుమార్, నిపున్ రాజా పాల్గొన్నారు.

రాష్ట్రానికి ఐఫోన్ తయారీ సంస్థ

- ఫాక్స్‌కాన్ కంపెనీకి నేడు కొంగరకలాన్‌లో భూమిపూజ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తైవాన్‌కు చెందిన ఐఫోన్‌లు, ఎలక్ట్రానిక్ ఉత్పత్తుల తయారీ సంస్థ ఫాక్స్‌కాన్ తెలంగాణలో కంపెనీ ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. తెలంగాణ ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కెటిఆర్ ఫాక్స్‌కాన్ ప్రతినిధులతో కలిసి కంపెనీ నిర్మాణానికి సోమవారం ఉదయం పదిన్నర గంటలకు భూమిపూజ చేయనున్నారు. రూ.1,656 కోట్ల పెట్టుబడితో రంగారెడ్డి జిల్లాలోని కొంగరకలాన్ గ్రామంలో ఫాక్స్‌కాన్ కంపెనీ నిర్మాణం చేపడుతున్నారు. ఈ కంపెనీ నిర్మాణం పూర్తయితే సుమారు 35 వేల మందికిపైగా స్థానికులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని కంపెనీ ప్రతినిధులు చెబుతున్నారు. తెలంగాణలో కంపెనీ ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం కోరిన వెంటనే ఫాక్స్‌కాన్ సంస్థ అందుకు అంగీకరించింది. దాంతో రాష్ట్ర సర్కారు కంపెనీ ఏర్పాటు కోసం ఫాక్స్‌కాన్ సంస్థకు 196 ఎకరాల భూమిని కేటాయించింది. రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి తారక రామారావు, ఫాక్స్‌కాన్ టెక్నాలజీస్ గ్రూప్ చైర్మెన్ యంగ్‌ల్యూతోపాటు మంత్రి సబితా రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే తదితరులు కార్యక్రమంలో పాల్గొంటారు. మొబైల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ ఉత్పత్తుల తయారీలో ప్రపంచంలోనే అత్యంత ప్రఖ్యాతిగాంచిన సంస్థ ఫాక్స్‌కాన్... సుమారు 70 శాతం యాపిల్ ఐఫోన్లు తయారు చేస్తుండడం గమనార్హం. యాపిల్ సంస్థ నుంచి ఇప్పటికే ఫాక్స్‌కాన్‌కు భారీ ఆర్డర్ రావడంతో వచ్చే ఏడాది చివరికల్లా ఉత్పత్తి ప్రారంభించాలని సంస్థ లక్ష్యంగా పెట్టుకున్నది.

ఎండ@45.9 డిగ్రీలు

- రాష్ట్రంలో మరింత పెరగనున్న ఉష్ణోగ్రతలు
- ప్రజలు అప్రమత్తంగా ఉండాల్సిందే

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

మొన్నటి వరకు వర్షాలతో కొంత చల్లగా ఉన్నవాతావరణంలో క్రమంగా మార్పులు మొదలయ్యాయి. ఉష్ణోగ్రత క్రమక్రమంగా పెరుగుతూపోతుంది. మంచిర్యాల జిల్లా కొండాపూర్‌లో ఆదివారం నాడు 45.9 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రత రికార్డయింది. ఈ ఏడాది ఇదే అత్యధిక ఉష్ణోగ్రత. ఇప్పటికే చాలా జిల్లాల్లో ఉష్ణోగ్రతలు 45 డిగ్రీలు దాటిపోయాయి. వచ్చే నాలుగైదు రోజుల్లో ఈ ఉష్ణోగ్రతలు కాస్తా రెండు నుంచి మూడు డిగ్రీల మేర పెరిగే అవకాశముంది. ముఖ్యంగా మంచిర్యాల, ఆదిలాబాద్, కొమ్రంభీం అసిఫాబాద్, నిజామాబాద్, పెద్దపల్లి, కరీంనగర్, నల్లగొండ, ఖమ్మం జిల్లాల్లో ఎండల తీవ్రత ఎక్కువగా ఉంది. భానుడు ఉదయం పది గంటల నుంచే తన ప్రతాపాన్ని చూపుతున్నాడు. ఇంట్లో నుంచి బయటకు వెళ్లలేని భయానక పరిస్థితిని కల్పిస్తున్నాడు. ఓవైపు తీవ్ర ఎండలు, మరోవైపు ఉక్కపోతతో ప్రజలు అల్లాడిపోతున్నారు. ఇండ్లల్లో ఫ్యాన్లు వేసినా వేడిగాలే వస్తుంది తప్ప ఉపశమనం లభించని పరిస్థితి. దీంతో చిన్నపిల్లలు, వృద్ధులు అల్లాడిపోతున్నారు. మరోవైపు ఉష్ణోగ్రతలు 45 డిగ్రీలు దాటి పెరుగుతున్న క్రమంలో వడగాల్పులు వీచే ప్రమాదమూ ఉంది. 45 డిగ్రీలు దాటిన ప్రాంతాలు రెడ్ హెచ్చరిక జాబితాలో ఉంటాయి. ఈ నేపథ్యంలో ఆయా ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. వడదెబ్బకు గురయ్యే ప్రమాదముంది. చిన్నపిల్లలు, వృద్ధులు మరింత జాగ్రత్తతో ఉండాల్సిన అవసరముంది. శరీరం డీహైడ్రేషన్‌కు గురి కాకుండా ఉండేందుకుగానూ వీలైనంత మేరకు ఎక్కువగా(కనీసం నాలుగైదు లీటర్ల) నీళ్లు తాగాల్సిన అవసరముంది. వీలైనంత మేరకు ప్రయాణాలు ఉదయం, సాయంత్రం పూటనే ఉండేలా చూసుకోవాలి.

తరుగు పేరిట ధాన్యం దించుకోవట్లే

- రైస్‌మిల్లర్ల తీరుపై రైతుల ఆందోళన



రైస్‌మిల్ ఎదుట ఆందోళన చేస్తున్న రైతులు

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

ఇటీవల కురిసిన అకాల వర్షాలకు ధాన్యం తడిచి రంగు మారడంతో పాటు మొలకలు వచ్చిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకొస్తే రైస్‌మిల్లర్ల యజమానులు తరుగు పేరిట కొనుగోలు చేయడం లేదని, ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం ప్రతి ధాన్యం గింజను కొనుగోలు చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. నిజామాబాద్ జిల్లా సాలూర మండల కేంద్రంలోని తిరుమల రైస్‌మిల్ ఎదుట రైతులు ఆదివారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా హున్సా సొసైటీ చైర్మెన్ మందర్న రవి మాట్లాడుతూ.. ఇటీవల ఏకధాటిగా కురిసిన అకాల వర్షాలు, వడగండ్ల మూలంగా బోధన్-సాలూర మండలంలోని పలు సొసైటీల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధ్యానం కొనుగోలు కేంద్రాల వద్ద, రోడ్ల వెంబడి ఉన్న కొంతమంది రైతుల ధాన్యం కుప్పల కిందకు కొంత వర్షం నీరు చేరడం వల్ల కుప్ప కింది భాగంలోని వడ్లు తేమ శాతంతో కొంత రంగు మారాయని తెలిపారు. దాన్ని సాకుగా చూపడంతో పాటు వర్షాలతో తేమ 14-15 శాతం ఉందని, అలాగే నూక శాతం ఎక్కువగా ఉందని తరుగు ఎక్కువగా ఇస్తేనే ధాన్యం దించుకుంటామని రైతులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సొసైటీ చైర్మెన్ హోదాలో రైతుల పక్షాన వెళ్లి మాట్లాడినా కొందరు మిల్లర్లు పట్టించుకోవడం లేదని వాపోయారు. ప్లీనరీ సమావేశంలో రైతుల వద్ద ఉన్న తడిసిన ధాన్యాన్ని-మొలకెత్తిన ధాన్యాన్ని కొనుగోలు చేస్తామని ఎమ్మెల్యే షకీల్ ఆమేర్ హామీ ఇచ్చారని దాంతో రైతులు హర్షం వ్యక్తం చేశారని, అయినా ఇప్పటి వరకు ఎలాంటి ధాన్యం కొనుగోలు చేయలేదని తెలిపారు. ఇప్పటికైనా ఎమ్మెల్యే తక్షణమే స్పందించి రైతుల ఇబ్బందులు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ నాయకులు ఖాజాపూర్ అశోక్, హున్సా మాజీ ఎంపిటిసి చీల శంకర్, సొసైటీ డైరక్టర్ రమేష్, రైతులు శంకర్, ఛిద్రపు అనిల్, చీల ప్రకాష్ బాధిత రైతులు పాల్గొన్నారు.



అభివృద్ధి శాశ్వతం

- ఎన్నికల్లో గెలుపోటములు సహజం
- టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఎన్నికల్లో గెలుపోటములు సహజం.. కానీ, తన హయంలో జరిగిన అభివృద్ధి శాశ్వతమని టిడిపి అధినేత చంద్రబాబు అన్నారు. హైదరాబాద్ గీతం యూనివర్సిటీలో ఆదివారం జరిగిన కౌటిల్య స్కూల్ ఆఫ్ పబ్లిక్ పాలసీ విద్యార్థుల గ్రాడ్యుయేషన్ కార్యక్రమంలో చంద్రబాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 25 ఏళ్ల క్రితం విజన్ 2020 ప్రకటించినప్పుడు కొందరు విజన్ 420 అని అవహేళన చేశారన్నారు. కానీ, ప్రస్తుతం తన విజన్ హైదరాబాద్ అభివృద్ధిలో కనిపిస్తోందని తెలిపారు. ఇప్పుడు విజన్ 2047 గురించి ఆలోచించాల్సిన అవసరం ఉందన్నారు. 2047కు దేశానికి స్వాతంత్ర్యం వచ్చి వందేళ్లు అవుతుందన్నారు. టెలికమ్యూనికేషన్ల విషయంలోనూ ఎన్నో సంస్కరణలు తెచ్చామని, వాటి ఫలితాలు ఇప్పుడు అంతా అనుభవిస్తున్నారని తెలిపారు. భారతదేశంలో ఉన్నంత యువశక్తి ప్రపంచ దేశాల్లో ఎక్కడాలేదని, భవిష్యత్‌లో భారత్‌కు సాటి వచ్చే దేశాలు లేవన్నారు. 75 ఏళ్ల క్రితం వరకు బ్రిటీషర్లు ఇండియాను పాలించారు.. కానీ, ఇప్పుడు ఓ ఇండియన్ బ్రిటన్‌ను పాలిస్తున్నారని తెలిపారు. దేశంలో మధ్య తరగతి ప్రజల సంఖ్య బాగా పెరుగుతోందన్నారు. ప్రస్తుతం మనది ప్రపంచంలోనే ఐదో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఉందని, మరో పాతికేళ్లలో మనది ప్రపంచంలోనే మూడో ఆర్థిక వ్యవస్థ అవుతుందని చెప్పారు. 2047నాటికి ఇండియా ప్రపంచంలోనే అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ కావాలని, మన తలసరి ఆదాయం 26వేల డాలర్లుగా ఉండాలని చంద్రబాబు ఆకాంక్షించారు. యువత తలచుకుంటే ఇది సాధ్యమేనన్నారు. తాను సిఎంగా ఉన్న సమయంలో విద్యుత్ సంస్కరణలు తీసుకొచ్చినప్పుడు చాలా మంది హెచ్చరించారనీ, వాటి కారణంగా తాను అధికారమూ కోల్పోయానని గుర్తు చేశారు. దేశంలో విద్యుత్ సంస్కరణల రూపకల్పనలో తనది కీలకపాత్ర అని చెప్పారు. దేశంలోనే మొదటి హరిత విమానాశ్రయం శంషాబాద్‌లో నిర్మించామన్నారు. శంషాబాద్ విమానాశ్రయం కోసం 20 ఎయిర్‌పోర్టులను స్వయంగా పరిశీలించామని తెలిపారు. ఐటి, బిటి, ఫార్మా వంటి రంగాల్లో దేశం గణనీయమైన ప్రగతి సాధించిందని చంద్రబాబు వివరించారు. విద్యార్థులకు చంద్రబాబు డిగ్రీ పట్టాలను అందజేశారు.

బిజెపిని ఓడించడమే లక్ష్యం

- సిపిఐ జాతీయ కార్యదర్శి కె నారాయణ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

విధ్వంసక రాజకీయాలు చేస్తున్న బిజెపిని దేశవ్యాప్తంగా ఓడించడమే సిపిఐ లక్ష్యం అని ఆ పార్టీ జాతీయ కార్యదర్శి కె నారాయణ తెలిపారు. సిపిఐ ఏప్రిల్ 15 నుంచి మే 15 వరకు నెల రోజులు దేశ వ్యాప్తంగా 'బిజెపి కో హటావో - దేశ్ కో బచావో' నినాదంతో బిజెపి ప్రజా వ్యతిరేక, వినాశకరమైన విధానాలను ప్రజలకు వివరించేందుకు పాదయాత్రలు నిర్వహించినట్టు తెలిపారు. హైదరాబాద్‌లోని మూసారాంబాగ్, ఆస్మాన్ గఢ్, టివి టవర్, బి బ్లాక్స్, తిరుమల హిల్స్, వికె దాగే నగర్, బ్యాంక్ కాలనీ తదితర బస్తీలు, కాలనీల్లో ఆదివారం హైదరాబాద్ జిల్లా సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన పాదయాత్రలో ఆయన పాల్గొని మాట్లాడారు. కర్ణాటకలో మోడీ, అమిత్ షా ఎన్నికల ప్రచారానికి నాయకత్వం వహించినా బిజెపి అవమానకరమైన ఓటమి చెందిందన్నారు. ప్రజలను పేదరికం, వెనుకబాటు నుంచి బయటికి నడిపించడంలో మోడీ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. రెండు పర్యాయాల బిజెపి కేంద్రంలో బిజెపి ప్రభుత్వం.. దేశ సంస్కృతి, నైతికత, ప్రజా సంస్థలు, ప్రజాస్వామ్య నిర్మాణం, రాజ్యాంగ విలువలకు అపారమైన నష్టం కలిగించిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఇటి నరసింహ మాట్లాడుతూ.. బిజెపి నియంతృత్వ పాలన నుంచి దేశాన్ని కాపాడుకోవలసిన అవసరం ఏర్పడిందని, ప్రజలు బిజెపి తప్పిదాలను గమనించి వచ్చే ఎన్నికల్లో ఓడించి తగిన గుణపాఠం చెప్పాలని విజ్ఞప్తి చేశారు. ఈ పాదయాత్రలో.. సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆందోజు రవీంద్ర చారి, హైదరాబాద్ జిల్లా కార్యదర్శి ఎస్ ఛాయాదేవి, రాష్ట్ర సమితి సభ్యులు బి వెంకటేశం, జిల్లా సహాయ కార్యదర్శులు కమతం యాదగిరి, స్టాలిన్, జిల్లా కార్యవర్గ సభ్యులు జి చంద్రమోహన్ గౌడ్, నిర్లేకంటి శ్రీకాంత్, కంపల్లి శ్రీనివాస్, పార్టీ నగర నేతలు తదితరులు పాల్గొన్నారు.



పదోన్నతులు పూర్తి చేయాలి

- సిపిఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్‌ను పునరుద్ధరించాలి
- జులై 1 నుంచి నూతన వేతన సవరణ అమలు జరగాలి
- యుఎస్‌పిసి స్టీరింగ్ కమిటీ డిమాండ్

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

వేసవి సెలవుల్లోనే ఉపాధ్యాయుల పదోన్నతుల ప్రక్రియను పూర్తి చేయాలంటూ రాష్ట్ర ప్రభుత్వాన్ని ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ (యుఎస్‌పిసి) స్టీరింగ్ కమిటీ డిమాండ్ చేసింది. పాఠశాలలు పున్ణప్రారంభమయ్యేలోపు పదోన్నతులు నిర్వహించి ఉపాధ్యాయ నియామకాలకు నోటిఫికేషన్ ఇవ్వాలని కోరింది. ఆదివారం హైదరాబాద్‌లోని టిఎస్‌యుటిఎఫ్ రాష్ట్ర కార్యాలయంలో యూఎస్‌పిసి రాష్ట్ర స్టీరింగ్ కమిటీ సమావేశాన్ని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కె జంగయ్య అధ్యక్షతన నిర్వహించారు. విద్యారంగంలో నెలకొన్న పరిస్థితులను సమావేశం సమీక్షించింది. అనంతరం యూఎస్‌పిసి స్టీరింగ్ కమిటీ సభ్యులు చావ రవి, వై అశోక్ కుమార్, ఎం రవీందర్, ఎం సోమయ్య, టి లింగారెడ్డి, కొమ్ము రమేష్, ఎన్ యాదగిరి, జాడి రాజన్న, మేడి చరణ్‌దాస్, కె భిక్షపతి, తులసీరాం సంయుక్తంగా ఒక ప్రకటన విడుదల చేశారు. ఉపాధ్యాయుల బదిలీల జిఓపై హైకోర్టులో స్టే కొనసాగుతున్నందున మొత్తం ప్రక్రియ నిలిచిపోయిందని తెలిపారు. పాఠశాలల్లో వేలాది ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు. విద్యా సంవత్సరం అస్తవ్యస్తంగా నడుస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. పదోన్నతులు, నియామకాల ద్వారానే ఖాళీ పోస్టులు భర్తీ చేయాల్సి ఉంటుందని తెలిపారు. కనుక బదిలీలపై హైకోర్టు తీర్పు వచ్చేలోగా తాత్కాలిక ప్రాతిపదికన ఉపాధ్యాయులకు పదోన్నతులు చేపట్టాలని కోరారు. తద్వారా ఏర్పడిన ఖాళీల్లో నియామకాలకు నోటిఫికేషన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే ఐదు రాష్ట్రాల్లో సిపిఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించారని గుర్తు చేశారు. సిపిఎస్ రద్దు వాగ్దానం చేసి హిమాచల్ ప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని పేర్కొన్నారు. కేంద్రంలోని బిజెపి సర్కారు విధానాలను వ్యతిరేకిస్తూ పోరాడుతున్న బిఆర్‌ఎస్ పార్టీ తెలంగాణలోనూ సిపిఎస్‌ను రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని కోరారు. అన్ని యాజమాన్యాల ఉపాధ్యాయులకు ప్రతినెలా మొదటి తేదీన వేతనాలివ్వాలని సూచించారు. ట్రెజరీల్లో ఆమోదం పొంది ఏడాదిగా ప్రభుత్వం వద్ద పెండింగ్‌లో ఉన్న బిల్లులన్నింటినీ వెంటనే మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. బకాయి ఉన్న మూడు డిఎలను ప్రకటించాలని కోరారు. జులై ఒకటో తేదీ నుంచి నూతన వేతన సవరణ అమలు జరిగేలా తెలంగాణ రెండో పిఆర్‌సిపై నిర్ణయం తీసుకోవాలని తెలిపారు. పై సమస్యల పరిష్కారం కోసం రాష్ట్రంలో ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలన్నీ జెఎసిగా ఏర్పడి ఐక్యంగా ఉద్యమిస్తే సానుకూల ఫలితాలు వచ్చే అవకాశముంటుందని, అందుకు యుఎస్‌పిసిగా అన్ని సంఘాలతో చర్చించటానికి చొరవ తీసుకోవాలని సమావేశం తీర్మానించిందని పేర్కొన్నారు.



మోడీ పాలనపై తిరుగుబాటు మొదలైంది

- మంత్రి జగదీశ్ రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మోడీ పాలనపై తిరుగుబాటు మొదలైందని, అందుకు కర్ణాటక ఫలితాలే నిదర్శనమని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. బిజెపి అనైతిక ప్రభుత్వాల ఏర్పాటు పట్ల ప్రజలు విసుగెత్తిపోతున్నారని, కన్నడ ప్రజలు ఇచ్చిన తీర్పే ఇందుకు నిదర్శనమని పేర్కొన్నారు. ఆదివారం నల్లగొండ జిల్లా చిట్యాల మండలం వెలిమినేడు గ్రామంలో స్థానిక ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్యతో కలిసి మంత్రి మీడియాతో మాట్లాడారు. తాము ఏది చేసినా చెల్లుతుందని బిజెపి అహంకారంతో వ్యవహరిస్తున్నదన్నారు. తొమ్మిది రాష్ట్రాల్లో అనైతికంగా ప్రభుత్వాలను ఏర్పాటు చేసిన చరిత్ర మోదీదని జగదీశ్‌రెడ్డి విమర్శించారు. ప్రజల తీర్పును లెక్క చేయకుండా అప్రజాస్వామిక పద్ధతుల్లో బిజెపి ప్రభుత్వాలను ఏర్పాటు చేసిందని మండిపడ్డారు. దీంతో విసుగెత్తిన కన్నడ ప్రజలు కర్రు కాల్చి వాత పెట్టారని, తిరుగుబాటు ఎట్లా ఉంటుందో మోదీకి రుచి చూపించారని అన్నారు. వచ్చే ఎన్నికల్లో బిజెపికి గుణపాఠం చెప్పేందుకు యావత్ భారతావని సన్నద్ధం అవుతుందని తెలిపారు. విపక్ష కాంగ్రెస్ పార్టీ దివాళాకోరు స్థితిలో ఉందని, ప్రజలు అధికారం అప్పగించినా నిలబెట్టుకునే స్థితిలో లేదని ఎద్దేవా చేశారు.

బిజెపి ముక్త్ సౌతిండియా

- ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కర్ణాటకలో ఘోర పరాజయంతో బిజెపి ముక్త్ సౌతిండియాగా దక్షిణ భారతదేశం మారిందని పియుసి చైర్మెన్, ఆర్మూర్ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి పేర్కొన్నారు. కర్ణాటక నుంచే అభివృద్ధి నిరోధక బిజెపి పతనం మొదలైందని తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. కమలనాథుల మత విద్వేష రాజకీయాలకు కాలం చెల్లిందని తెలిపారు. కార్పొరేట్ శక్తులకు వెన్నుదన్నుగా నిలిచి పేద ప్రజల బతుకులను బలి చేస్తున్న ప్రధాని నరేంద్రమోడీ డ్రామాలకు శాశ్వతంగా తెరవేయడానికి కన్నడ ప్రజలు దేశానికే దిశానిర్దేశం చేశారని అభినందించారు. తెలంగాణలో బిజెపికి డిపాజిట్లూ రావని పేర్కొన్నారు. రాష్ట్రంలో బిజెపి, కాంగ్రెస్ పార్టీలకు సింగిల్ డిజిట్ స్థానాలూ రావని తెలిపారు. రాష్ట్రంలో హ్యాట్రిక్ సిఎంగా కెసిఆర్ చరిత్ర సృష్టిస్తారని స్పష్టం చేశారు. రేవంత్‌రెడ్డి వాపును చూసి బలుపు అనుకుంటున్నారని, ఇక్కడ కాంగ్రెస్ గెలుస్తోందని పగటికలలుగంటున్నారని ఎద్దేవా చేశారు. బిఆర్‌ఎస్‌కు కాంగ్రెస్‌తో పొత్తు ఉంటుందని బిజెపి రాష్ట్ర అధ్యక్షులు బండి సంజయ్ చేసినవి సిగ్గుమాలిన వ్యాఖ్యలని విమర్శించారు.

ఐదు నెలల్లో తెలంగాణలో రామరాజ్యం

- అసోం సిఎం హిమంత బిశ్వశర్మ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణలో మరో ఐదు నెలల్లో రజాకార్ల రాజ్యం ముగిసి.. రామరాజ్యం రానున్నదని అసోం సిఎం హిమంత బిశ్వశర్మ అన్నారు. హనుమజ్జయంతి సందర్భంగా కరీంనగర్‌లో బిజెపి ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన హిందూ ఏక్తా యాత్రలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా హిమంత మాట్లాడుతూ.. అసోంలో లీటరు పెట్రోల్ ధర రూ.97 ఉంటే.. తెలంగాణలో రూ.107లు ఉందన్నారు. అసోంలో ప్రభుత్వ ఉద్యోగులకు ప్రతి నెలా ఒకటో తేదీన జీతాలు చెల్లిస్తే.. ఇక్కడ మాత్రం ఎప్పుడిస్తారో తెలియని పరిస్థితి నెలకొందన్నారు.

18న టిడబ్ల్యుజెఎఫ్ మహాధర్నా

- కరపత్రం ఆవిష్కరించిన ఫెడరేషన్ నాయకులు



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న టిడబ్ల్యుజెఎఫ్ నాయకులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

జర్నలిస్టుల ఇళ్ల సాధన కోసం ఈ నెల 18న హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద మహాధర్నా నిర్వహించనున్నట్టు తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ రాష్ట్ర కమిటీ ప్రకటించింది. ఆదివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో మహాధర్నాకు సంబంధించిన కరపత్రాన్ని ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి బి బసవపున్నయ్య, ఉపాధ్యక్షులు గుడిగ రఘు ఆవిష్కరించారు. గత 35 ఏళ్లుగా ఇళ్ల స్థలాల కొరకు పాత్రికేయులు పోరాటం చేస్తున్నా.. ప్రభుత్వం కాలయాపన చేస్తోంది తప్ప నేటి వరకు ఇళ్ల స్థలాలు కేటాయించలేదని ఫెడరేషన్ నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. హైదరాబాద్ నగరంతోపాటు రాష్ట్రవ్యాప్తంగా సుమారు 60 వేల పైచిలుకు జర్నలిస్టులు ఉన్నారని గుర్తు చేశారు. మహానగరంలో 4000 నుంచి 5000 మందికి ఇళ్ల స్థలాలు ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. సొసైటీలలో ఉన్న వారితోపాటు ఏ సొసైటీలో సభ్యత్వం లేని వారికి సైతం ఇళ్ల స్థలాలు కేటాయించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే పాత్రికేయుల సమస్యలన్నిటిని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లేందుకే ఈ మహా ధర్నా నిర్వహిస్తున్నట్టు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న పాత్రికేయులంతా వందలాదిగా ధర్నాలో పాల్గొని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో టిడబ్ల్యుజెఎఫ్ నాయకులు జి విజయానంద్, జి మాణిక్‌ప్రభు, హెచ్‌యుజె కార్యదర్శి బి జగదీశ్వర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బివిన్ పద్మరాజు, మేడ్చల్ జిల్లా కార్యదర్శి కల్యాణ్ చక్రవర్తి, నాయకులు రేణయ్య పాల్గొన్నారు.

ఆరోగ్య తెలంగాణాయే ప్రభుత్వ లక్ష్యం

- 'తానా' కార్యాలయ ప్రారంభోత్సవంలో బోయిన పల్లి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ హాస్పిటల్స్ అండ్ నర్సింగ్ హోమ్స్ అసోసియేషన్ (తానా) నూతన కార్యాలయాన్ని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు బోయినపల్లి వినోద్‌కుమార్ ఆదివారం ప్రారంభించారు. హైదరాబాద్ కోఠిలోని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఎ) భవన సముదాయంలో ఈ కార్యాలయాన్ని ఏర్పాటు చేశారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలను అందించాలని ఈ సందర్భంగా బోయినపల్లి వైద్యులకు, ఆస్పత్రుల యాజమాన్యాలకు సూచించారు. తద్వారా ఆరోగ్య తెలంగాణ కోసం వైద్యులు తమ వంతు కృషి చేయాలని పిలుపునిచ్చారు.

ఆరోగ్య తెలంగాణాయే ప్రభుత్వ లక్ష్యమని, అందుకోసం ప్రతి జిల్లాకు ఒక మెడికల్ కాలేజీ మంజూరు చేసిన ఘనత సిఎం కెసిఆర్‌కే దక్కుతుందన్నారు. వైద్యారోగ్యం, విద్యా అనేది ప్రభుత్వ ప్రాధాన్యతలని చెప్పారు. ఆ దిశలోనే ప్రభుత్వం ప్రణాళికా బద్ధంగా ముందుకు సాగుతున్నాయని పేర్కొన్నారు. తానా రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ వి రాకేష్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎంవి ప్రసాద్, వైస్ చైర్మన్ డాక్టర్ సిహెచ్ జగన్మోహన్ రావు ఆధ్వర్యంలో వినోద్ కుమార్‌ను ఘనంగా సన్మానించారు.

జూన్ 1 నుంచి కొత్త రేషన్ కార్డులు?

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో జూన్ 1 నుంచి కొత్తరేషన్ కార్డులు జారీ చేయనున్నట్లు తెలిసింది. పెండింగ్‌లో ఉన్న రేషన్‌కార్డుల జారీ ప్రక్రియను ప్రభుత్వం వేగవంతం చేసేందుకు రెండు కమిటీలను నియమించింది. కొత్త రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకునేవారు కొత్తగా పేర్లను చేర్చుకునేవారికి ఇది ఉపయోగపడనుంది.

అనుమానస్పద స్థితిలో కూలీ మృతి

- భార్య భర్తల మధ్య తగాదాలే కారణం

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

కూలీ తలకు బలమైన గాయాలతో అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన ఘటన దుండిగల్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం జరిగింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఉత్తరప్రదేశ్‌లోని ఖుషి నగర్ తాలూకా ఫాజీ నగర్‌కు చెందిన మనోజ్ చౌహన్(35) ఆరేళ్ల కిందట ఉపాధి కోసం హైదరాబాద్‌కు వలస వచ్చాడు. దుండిగల్ మున్సిపాల్టీ బౌరంపేట్ పరిధిలోని సతీష్ కో అపరేటివ్ సొసైటీ సమీపంలోని శివ టైల్స్ కంపెనీలో అతను, అతని భార్య లక్ష్మి చౌహన్ దినసరి కూలీలుగా పని చేస్తున్నారు. బంగారు మైసమ్మ దేవాలయం సమీపంలో మూడేళ్లుగా తమ కుమారుడితో కలిసి నివసిస్తున్నారు.

అయితే భార్యాభర్తల మధ్య తరచూ గొడవలు జరుగుతూ ఉండేది. ఈ క్రమంలో శనివారం రాత్రి భార్య వేరొకరితో ఫోన్‌లో మాట్లాడడం చూసిన భర్త గొడవపడ్డాడు. అనంతరం ఆదివారం తెల్లవారేసరికి మనోజ్ చౌహన్ ఇంటి పరిసర ప్రాంతంలో తలకు బలమైన గాయాలతో శవమై కనిపించాడు. దుండిగల్ పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందడంతో సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు.. మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించారు. భార్య హత్య చేసిందా.. లేక ఇతరులు ఎవరైనా హత్య చేసి ఉంటారా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ధాన్యం ఆరబెట్టేందుకు రహదారే దిక్కు

- రోడ్లపైనే ధాన్యం ఆరబోత
- వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు
- ప్రత్యామ్నాయం చూపాలని రైతుల వినతి



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన పంటను ఆరబెట్టేందుకు రహదారులే దిక్కవుతున్నాయి. రాష్ట్రంలో ఏడు వేల ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. కానీ రైతు పంట కోసి ఆరబెట్టేందుకు స్థలం లేకపోవడంతో రోడ్లపైనే ఆరబెడుతున్నారు. ఆరు నెలల కిందటే భారత అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు రహదారులపై ధాన్యం ఆరబెట్టొద్దని, ప్రమాదాలు జరిగితే రైతులే బాధ్యత వహించాలని స్పష్టం చేసింది.

రాష్ట్ర ప్రభుత్వం 2021లో ధాన్యాన్ని ఆరబెట్టేందుకు కల్లాల పథకాన్ని ప్రారంభించింది. రైతు కల్లాలు పొడవు, వెడల్పు కలిపి 50 చదరపు మీటర్ల నుంచి 75 చదరపు మీటర్ల వరకు నిర్మించుకునేందుకు 60 వేల నుంచి 85 వేల వరకు ఉపాధి హామీ ద్వారా కేటాయించింది. కాగా ఎక్కువ విస్తీర్ణం కలిగిన బడా భూస్వాములు, రైతులే రైతు కల్లాలు నిర్మించుకునేందుకు ఆసక్తి చూపారు. అయితే వ్యవసాయ భూముల్లో నిర్మించుకోవాల్సి ఉండగా పలువురు ఇంటి ఆవరణలో నిర్మించుకోవడం, రాష్ట్ర ప్రభుత్వ ఉపాధి హామీ సర్వర్‌లో చేర్చింది. అయితే కేంద్ర ప్రభుత్వం నిరాకరించింది. దాంతో కేంద్ర ప్రభుత్వ సర్వర్‌లో కల్లాల పథకం లేదు.

ప్రయాణికులకు ప్రాణహాని

రోడ్లపైన ధాన్యం ఆరబెట్టుతుండటంతో అప్పుడప్పుడు ప్రయాణికుల ప్రాణాలకు హాని కలుగుతోంది. ప్రయాణికులకు రాత్రి సమయంలో రోడ్లపైన ఉన్న ధాన్యం కుప్పలు కనిపించకపోవడంతో వాడికి ఢీకొని ప్రమాదాలకు గురవుతూ మృత్యువాత పడుతున్నారు. ఇప్పటివరకు నవీపేట్ మండలంలో గాయాల పాలైన ప్రయాణికులు కోకొల్లలు. మృతిచెందిన వారూ ఉన్నారు. గత సీజన్లో మండలంలోని గాంధీ నగర్ వద్ద భార్యాభర్తలు ఇద్దరూ ధాన్యం కుప్పను మోటార్ బైక్‌తో ఢీకొని భర్త మృతిచెందారు. దాంతో రైతుపై కేసు నమోదు చేయడంతో జైలు పాలయ్యాడు. తాజాగా ఆదివారం సైతం డిచ్‌పల్లి మండలం ఘన్‌పూర్‌లో రోడ్డుపై మక్కపంట ఆరబెట్టగా ప్రమాదవశాత్తు రోడ్డు ప్రమాదానికి గురై వ్యక్తి మృతిచెందాడు. ప్రయాణికులు ప్రాణాలు కోల్పోయి కుటుంబాలు రోడ్డు పాలవడమే కాక రైతులు సైతం తీవ్రంగా నష్టపోతున్నారు. ప్రభుత్వ యంత్రాంగం స్పందించి ధాన్యం ఆరబెట్టేందుకు గ్రామాల్లో అవకాశం ఉన్న స్థలాలను గుర్తించి ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకొని ప్రయాణికుల ప్రాణాలతో పాటు రైతు కుటుంబాలను కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

ధాన్యం ఆరబెట్టేందుకు కష్టాలు పడుతున్నాం
గుగ్లోత్ బీమ్‌రావు, గిరిజన రైతు, దర్యాపూర్ తండా

ధాన్యం ఆరబెట్టేందుకు సరైన స్థలం లేక ఇబ్బందులు పడుతున్నాం. వాతావరణ మార్పులతో అకాల వర్షాలు పడే అవకాశం ఉన్నందున ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను త్వరగా ప్రారంభించాలి. కొనుగోలు చేయాలి. వానొస్తే తడిసిన వడ్లు ఆరబెట్టేందుకు అధికారులు స్థలాన్ని కేటాయించాలి.

బదిలీలు, పదోన్నతులు నిర్వహించాలి

- బోయిన్‌పల్లి వినోద్‌కుమార్‌కు ఎస్‌జిటియు వినతి



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

వేసవి సెలవుల్లోనే ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులను నిర్వహించాలని ఎస్‌జిటియు డిమాండ్ చేసింది. హైదరాబాద్‌లో ఈ మేరకు రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు బోయిన్‌పల్లి వినోద్‌కుమార్‌ను ఆ సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కరివేద మహిపాల్‌రెడ్డి, అరికెల వెంకటేశం ఆదివారం కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ షెడ్యూల్‌లోనే పిఎస్‌హెచ్‌ఎం పోస్టులను భర్తీ చేయాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో సర్వీసు పర్సన్లను నియమించాలని సూచించారు. ప్రాథమిక పాఠశాలల్లోని పిల్లలకు షూ, టై, స్కూల్ బ్యాగ్ ఉచితంగా ప్రభుత్వం అందించాలని కోరారు. కోర్టు తీర్పుతో బదిలీలు, పదోన్నతుల షెడ్యూల్ ఇస్తామని, సర్వీస్ పర్సన్లను నియమించడానికి కృషి చేస్తామని వినోద్‌కుమార్ హామీ ఇచ్చారని తెలిపారు. ముఖ్యమంత్రి కెసిఆర్‌తో మాట్లాడి పిల్లలకు పుస్తకాలు, వర్క్ బుక్‌లతోపాటు షూ, బెల్టు, టై, స్కూల్ బ్యాగ్ ఉచితంగా ప్రభుత్వం అందించేలా కృషి చేస్తానన్నారని తెలిపారు.

కర్ణాటక ఫలితాలు మత రాజకీయాలకు చెంపపెట్టు

- వైఎస్ షర్మిల

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కర్ణాటక ఎన్నికల ఫలితాలు మతరాజకీయాలకు చెంపపెట్టులాంటివని వైఎస్‌ఆర్‌టిపి అధ్యక్షులు వైఎస్ షర్మిల ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అదే తరహాలో తెలంగాణలోనూ కుట్ర రాజకీయాలకు తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ప్రజల అమాయకత్వాన్ని ఆసరా చేసుకుని తమ స్వార్థ రాజకీయాలకు పాల్పడితే ఇలాంటి తీర్పులే వెలువడుతాయని గుర్తుచేశారు. కులం, మతం, డబ్బు, అధికారమదంతో ప్రజాస్వామ్యాన్ని కొనలేరని పేర్కొన్నారు. నియంత పాలనను గద్దె దించేందుకు తెలంగాణ సమాజం ఎదురుచూస్తోందని తెలిపారు.

తెలంగాణ సమాజాన్ని అద్దంలో చూపిన 'ఐదు తరాలు'

- ముందు తరాలకు స్ఫూర్తి ఈ పుస్తకం
- మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా అదనపు కలెక్టర్ ఏనుగు నరసింహారెడ్డి


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న నరసింహారెడ్డి తదితరులు

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

'ఐదు తరాల పుస్తకం.. తెలంగాణ సమాజాన్ని అద్దంలో చూపించింది. ఈ పుస్తకం ముందు తరాలకు స్ఫూర్తి' అని మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా అదనపుకలెక్టర్ ఏనుగు నరసింహారెడ్డి అన్నారు. హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ సాహితి ప్రధాన కార్యదర్శి కె ఆనందాచారి అధ్యక్షతన ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో 'ఐదు తరాలు' పుస్తకాన్ని నరసింహారెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భాషలో సహజత్వం రచయితకే సాధ్యమని అన్నారు. సాహిత్యం పరంగానే కాకుండా చరిత్రకు సంబంధించిన రెఫరెన్స్‌గానూ ఈ పుస్తకం ఉపయోగపడుతుందని తెలిపారు. పాతకాలంలో జరిగిన సంఘటనలను కండ్లకుకట్టినట్టు రచయిత వివరించారని తెలిపారు. తెలంగాణ అధికార భాషా సంఘం అధ్యక్షులు మంత్రి శ్రీదేవి మాట్లాడుతూ 'ఈ పుస్తకం మా నాయిన పరకాయ ప్రవేశం చేసి రాసినట్టుగానే అనిపించింది. సహజత్వాన్ని గుర్తుచేస్తోంది' అని అన్నారు. గతంలో తెలంగాణ భాష, యాస, మాండలికమంటేనే నవ్వుకునేవారని, నేడాపరిస్థితి లేదని చెప్పారు. జమీందార్ల కులంలో పుట్టి పేదవారి కోసం పనిచేయడంతో పాటు పేదలకు సంబంధించిన వెయ్యి కేసులను వాదించి గెలిపించిన ఘనత రచయిత మల్లారెడ్డికే దక్కుతుందన్నారు. సమసమాజం కోసం పోరాడి ప్రాణాలర్పించిన వ్యక్తి జార్జిరెడ్డి అని ఈ సందర్భంగా ఆమె గుర్తుచేశారు. వేమన, బసవేశ్వరుడు లాంటి ఎంతో మంది సమాజం కోసం పనిచేశారని తెలిపారు. ఒక సిద్ధాంతం కోసం అడవిలో అన్నలు పోరాడుతుంటే ఓ పత్రిక కండోమ్‌ల గురించి వార్త రాసి ఆ ఉద్యమాన్ని కించపర్చిందని, ఇది తగదని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళలపై అఘాయిత్యాలు, దోపిడీలు, దౌర్జన్యాలను అడ్డుకోవడానికి పిడికిలెత్తాల్సిందేనని అన్నారు. తెలంగాణ రాకముందు కరెంట్ లేక పాముకాట్లతో, కరెంట్ షాకులతో, పోలీసుల కూంబింగ్‌లో అనేక మంది రైతులు మరణించారని తెలిపారు. కెసిఆర్ పాలనలో 24 గంటల కరెంట్‌తో ఆ బాధల్లేవని గుర్తుచేశారు. తాగునీటి కోసం బిందెల కొట్లాటలేదని చెప్పారు. రాపోలు సుదర్శన మాట్లాడుతూ ఈ పుస్తకం సేవా పరిమళాలు వెదజల్లే గులాబీ.. ఎర్ర గులాబీ అని అన్నారు. ఇది పక్కా చరిత్ర పుస్తకమేనని కొనియాడారు. అందులో మూలవాసుల కథ అద్భుతంగా ఉందని కితాబిచ్చారు. రచయిత వేముల ప్రభాకర్ మాట్లాడుతూ అధికార పీఠంలో సాహిత్య ఏనుగు అని నరసింహారెడ్డిని ప్రశంసించారు. మల్లారెడ్డికి నక్సలైట్లు, పేదల లాయర్ అని పేరుందని గుర్తుచేశారు. రచయిత అన్నవరం దేవేందర్ మాట్లాడుతూ రూ.వంద కోట్ల విలువైన భూములను కాపాడిన ఘనత లాయర్ మల్లారెడ్డికే దక్కుతుందని అన్నారు. ఆయన చరిత్రను సినిమా రూపంలో తీసుకురావాల్సిన అవసరముందని చెప్పారు. రచయిత గుడిపాటి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ అమ్మ నవల తెలుగులో వచ్చింది కానీ, తెలంగాణ భాషల్లోనూ వచ్చి ఉంటే బాగుండేదని అన్నారు. కవిత్వం, కవితలను సిలబస్‌లో చేర్చాలని కోరారు. పుస్తక రచయిత గులాబీల మల్లారెడ్డి మాట్లాడుతూ లాయర్‌గాను, సర్పంచ్‌గాను, రచయితగాను ప్రజలకు ఎంతో సేవా చేశానని అన్నారు. దోపిడీ, అవినీతి, అన్యాయానికి వ్యతిరేకంగా ధిక్కారస్వరం వినిపించానని తెలిపారు. అప్పటి రెవెన్యూ శాఖ మంత్రి నేదుమల్లి జనార్ధన్‌రెడ్డితో మాట్లాడి రూ.వంద కోట్ల విలువైన భూములను పేదలకు ఇప్పించానని గుర్తుచేశారు. అనంతరం పుస్తక రచయిత ఆధ్వర్యంలో అతిథులను శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో రెహమన్, ఆవంచ ప్రమోద్, కూర చిదంబరం, రాజశేఖర్, అంజిరెడ్డి, కృష్ణారెడ్డి, మోహనకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రగతి ప్రతిబింబించేలా దశాబ్ది ఉత్సవాలు

- 21 రోజులపాటు వేడుకలు : సిఎస్ శాంతికుమారి



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం జరిగి తొమ్మిదేళ్లు పూర్తయ్యి 10వ సంవత్సరంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా 21 రోజులపాటు దశాబ్ది ఉత్సవాలను నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ నేపథ్యంలో దశాబ్ధి ఉత్సవాలకు సంబంధించిన ఏర్పాట్లపై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఆదివారం సచివాలయంలో సమన్వయ సమావేశం నిర్వహించారు. జూన్ 2 నుంచి ఇరవై ఒక్క రోజులపాటు రాష్ట్రవ్యాప్తంగా ఈ దశాబ్ది ఉత్సవాలు జరగనున్నాయి. రాష్ట్రం ఏర్పడిన అనంతరం గత తొమ్మిదేళ్లలో ప్రతి శాఖ సాధించిన విజయాలను ప్రతిబింబించేలా తగు ఏర్పాట్లు చేపట్టాలని సిఎస్ అధికారులకు సూచించారు. గత తొమ్మిదేళ్లలో వాస్తవాలు, గణాంకాలు, సాధించిన విజయాలను వివరించే డాక్యుమెంటరీలను రాష్ట్ర స్థాయిలో ప్రతి శాఖ తయారు చేయాలని, ముఖ్యమైన పబ్లిక్ స్మారక చిహ్నాలు, భవనాలపై విద్యుత్ అలంకరణ చేయాలని ఆమె ఆదేశించారు. రాష్ట్ర స్థాయిలో జరిగే కార్యక్రమాలతోపాటు జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయిల్లో కూడా ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించనున్నారు. 21 రోజులపాటు ఉత్సవాలు సజావుగా నిర్వహించేందుకు పలు సబ్ కమిటీలను ఏర్పాటు చేశారు. ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్, జిఎడి సెక్రెటరీ శేషాద్రి, ఆర్థికశాఖ కార్యదర్శి టీకే శ్రీదేవి, పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్ కార్యదర్శి నిర్మల, సమాచార పౌర సంబంధాల శాఖ కమిషనర్ కే అశోక్‌రెడ్డి, సమాచార పౌర సంబంధాల శాఖ డైరెక్టర్ బీ రాజమౌళి, సాంస్కృతిక శాఖ డైరెక్టర్ ఎం హరికృష్ణ ఇతర అధికారులు సమావేశంలో పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న భట్టి విక్రమార్క

దొరల ప్రభుత్వం పోవాలి

- కెసిఆర్ ప్రజలను మోసం చేశారు
- సిఎల్‌పి నేత భట్టి విక్రమార్క

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

దొరల ప్రభుత్వం పోయి ప్రజా ప్రభుత్వం రావాలని సిఎల్‌పి నేత భట్టి విక్రమార్క అన్నారు. భట్టి విక్రమార్క చేపట్టిన పీపుల్స్ మార్చ్ పాదయాత్ర ఆదివారం ఉమ్మడి రంగారెడ్డి జిల్లా కొందుర్గ్, పరిగి మండలాల్లో కొనసాగింది. పరిగిలో ఆదివారం రాత్రి బస చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కర్ణాటకలో కాంగ్రెస్‌ను భారీ మెజార్టీతో గెలిపించిన ఆ రాష్ట్ర ప్రజలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ విజయ పరంపర దేశవ్యాప్తంగా కొనసాగుతుందని ధీమా వ్యక్తం చేశారు. నీళ్లు, నిధులు, నియామకాల కోసం పోరాడి తెచ్చుకున్న రాష్ట్రంలో దొరల పాలన కొనసాగుతుందని అన్నారు. సిఎం కెసిఆర్ ఆచరణకు సాధ్యం కానీ హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తొమ్మిదేండ్లలో డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు, పేదలకు 3 ఎకరాల భూమి, ఇండ్ల స్థలాలు, కేజీ టు పీజీ ఉచిత విద్య, నిరుద్యోగులకు ఉద్యోగాలు వంటి ఏ ఒక్క హామీ నెరవేరలేదని విమర్శించారు. పాలమూరు-ఎత్తిపోతల పూర్తి కాలేదని, లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్‌కు భూసేకరణ కూడా జరగలేదని అన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే పాలమూరు-ఎత్తిపోతల పూర్తి చేస్తామన్నారు. పాదయాత్రలో కాంగ్రెస్ సీనియర్ నేతలు మల్లు రవి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శంకర్, జిల్లా కమిటీ అధ్యక్షులు నరసింహారెడ్డి, లాలు కృష్ణ, విజయ్, నరేందర్ రెడ్డి, శంకర్, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.



కోటిన్నరకు చేరువలో కంటి వెలుగు పరీక్షలు

- 21 లక్షల మందికి రీడింగ్ అద్దాల పంపిణీ

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

రాష్ట్ర వ్యాప్తంగా కంటి పరీక్షలు విజయవంతంగా కొనసాగుతున్నాయి. 74 పని దినాల్లోమొత్తం కోటిన్నరకు చేరువకు మందికి పరీక్షలు చేశారు. ఇప్పటికే 21 లక్షల మందికి రీడింగ్ అద్దాలను ప్రభుత్వం పంపిణీ చేసింది. 'అంధత్వ రహిత' తెలంగాణ లక్ష్యం నినాదంతో ప్రారంభించిన కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా 10, 285 గ్రామ పంచాయతీ వార్డుల్లో, 3221 మున్సిపల్ వార్డుల్లో కంటి పరీక్షలు పూర్తి చేశారు. దృష్టి లోపాలు సవరించేందుకు 2018, ఆగస్టు 15న సిఎం కెసిఆర్ మెదక్ జిల్లా మల్కాపూర్‌లో తొలివిడత కంటి వెలుగు కార్యక్రమం ప్రారంభించినసంగతి తెలిసిందే.

ఈ క్రమంలో అప్పటి నుంచి ఇప్పటివరకు 50 లక్షల మందికి కళ్లద్దాలను పంపిణీ చేశారు. అదే స్ఫూర్తితో రెండో విడత కంటి వెలుగు కార్యక్రమాన్ని గత జనవరి 18 న ఖమ్మంలో ప్రారంభించారు. అనుకున్న లక్ష్యంమేరకు విజయవంతంగా కొనసాగుతోంది. లక్ష్యంగా నిర్దేశించుకున్న వంద పనిదినాల్లో రాష్ట్రంలో అందరికి పరీక్షలు పూర్తి చేయాలని ప్రభుత్వం సంకల్పించింది. పరీక్షల సమయంలో ఇతర వైద్య సేవలకు అంతరాయం లేకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. వైద్య, పంచాయతీరాజ్, మున్సిపల్, ఇతర శాఖలతోసహా, ప్రజాప్రతినిధులు అందరూ ఇందులో భాగస్వామ్యం అవుతున్నారు. పర్యవేక్షణకుగానూ రాష్ట్ర, జిల్లా స్థాయిలో క్వాలిటీ కంట్రోల్ బృందాలను ఏర్పాటు చేసి ప్రభుత్వం మానిటరింగ్ చేస్తోంది. ఇదే విధంగా కంటివెలుగు విజయవంతంగా కొనసాగితే రెండు కోట్ల మందికి కంటివెలుగు పరీక్షలు నిర్వహించే అవకాశం ఉన్నదనే అభిప్రాయాన్ని వైద్యాధికారులు వ్యక్తం చేశారు.

రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతి

ప్రజాశక్తి-హైదరాబాద్ బ్యూరో

సంగారెడ్డి జిల్లా ఆందోల్ మండలం బ్రాహ్మణ పల్లి చౌరస్తా వద్ద ఆదివారం తెల్లవారుజామున ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. అతి వేగంతో వస్తున్న ఆటో, ద్విచక్రవాహనం అదుపుతప్పి ఎదురెదురుగా ఢీ కొన్నాయి. ఈ ఘటనలో బైక్‌పై ప్రయాణిస్తున్న ఇద్దరు యువకులు అక్కడికక్కడే మృతి చెందారు. ఆందోల్ గ్రామానికి చెందిన గౌండ్ల రాములు (29), డాకూర్ గ్రామానికి చెందిన చింతాకి నాగరాజు (24)గా గుర్తించారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన ప్రదేశానికి చేరుకుని పోస్టుమార్టం నిమిత్తం మతదేహాలను ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మెదక్ జిల్లా పాపన్నపేట మండలంలోని కొత్తపల్లి అన్నారంలో రోడ్డు ప్రమాదం జరిగింది. ఎదురెదురుగా వస్తున్న రెండు బైకులు ఢీ కొన్నాయి. ఈ ఘటనలో టెక్మాల్‌కు చెందిన వ్యక్తి మతి చెందాడు. పోలీసులు సంఘటన ప్రదేశానికి చేరుకుని పోస్టుమార్టం నిమిత్తం మతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పూర్తి సమాచారం అందవలసి ఉంది.

లండన్‌లో అంబేద్కర్ మ్యూజియాన్ని సందర్శించిన కెటిఆర్

- లండన్‌లోని అంబేద్కర్ మ్యూజియాన్ని సందర్శించిన మంత్రి కెటిఆర్

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

లండన్ పర్యటనలో ఉన్న మంత్రి కెటిఆర్ అక్కడి భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ మ్యూజియాన్ని ఆదివారం సందర్శించారు. బారిష్టర్ చదువు కోసం ఇంగ్లాండ్ వెళ్లిన అంబేద్కర్ జీవితంలోని ముఖ్య ఘట్టాలను ఈ మ్యూజియంలో పొందుపరిచారు. ఎంతో ఆసక్తితో ఈ మ్యూజియాన్ని తిలకించిన కెటిఆర్ ఆనాడు అంబేద్కర్ నివసించిన గదినీ చూశారు.

హైదరాబాద్‌లో ప్రతిష్టించిన అంబేద్కర్ విగ్రహ నమూనాను మ్యూజియం అధికారులకు కెటిఆర్ బహూకరించారు. ఇండియన్ హై కమిషన్‌కు అంబేద్కర్ చిత్రపటాన్ని ఇచ్చారు.

బాబా సాహెబ్ సహకారాన్ని హైలైట్ చేయడంలో తెలంగాణ ప్రభుత్వం చేసిన అసాధారణ ప్రయత్నాలకు ఎఫ్ఎబిఒ-యుకె కూడా మంత్రి కెటిఆర్‌ను సత్కరించింది. విలియం గౌల్డ్, క్రిస్టోఫ్ జాఫ్రెలాట్‌లతో కలిసి రచించిన 'అంబేద్కర్ ఇన్ లండన్' పుస్తకం సంతకం కాపీని మంత్రి కెటిఆర్‌కు ఎఫ్ఎబిఒ ప్రెసిడెంట్ సంతోష్‌దాస్ అందించారు. ప్రజాస్వామ్య, సంక్షేమ భారత నిర్మాణంలో అంబేద్కర్ చేసిన కృషిని ఈ తరానికి తెలియజేయడానికి తెలంగాణ ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలను అభినందించింది.


మ్యూజియం అధికారులతో అంబేద్కర్ విగ్రహం వద్ద కెటిఆర్

కెటిఆర్‌తో ఇన్‌క్రెడిబుల్ హస్క్ ఇంటర్నేషనల్ గ్రూప్ చర్చలు

ఇన్‌క్రెడిబుల్ హస్క్ ఇంటర్నేషనల్ గ్రూప్ యుకె సిఇఒ కీత్ రిడ్జ్‌వే, ఇన్‌క్రెడిబుల్ హస్క్ ఇండియా సిఇఒ సీకా చంద్రశేఖర్ తదితరులు మంత్రి కెటిఆర్‌ను లండన్‌లో కలిశారు. హస్క్ పెల్లెట్స్, ప్లాస్టిక్ రీసైక్లింగ్ గురించి చర్చించారు. తెలంగాణలో 25మిలియన్ డాలర్ల పెట్టుబడి పెట్టడానికి ఆ సిద్ధంగా ఉన్నామని, ఏడాది వెయ్యి మెట్రిక్ టన్నుల బయో పెల్లెట్స్ ఉత్పత్తి చేస్తామని ఇన్‌క్రెడిబుల్ హస్క్ ఇంటర్నేషనల్ గ్రూప్ ఈ సందర్భంగా వెల్లడించింది. దీంతో పాటు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానితో కలిసి పనిచేయడానికి ఆ సంస్థ సంసిద్ధతను వ్యక్తం చేసింది. తమ ప్రభుత్వం నుంచి ఆ సంస్థకు పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని మంత్రి కెటిఆర్ భరోసా ఇచ్చారు.

అందినకాడికి దోసుడే

- నిఘా లేదు..నియంత్రణ లేదు
- లోడింగ్‌ల పేరుతో వసూళ్లు
- అధికారులు, కాంట్రాక్టర్ల సిండికేట్
- వేసవిలోనే సన్న ఇసుక కొరత

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

'తెలంగాణ రాష్ట్రంలో ఇసుక మాఫియాకు చెక్‌పెట్టి ప్రతి ఇంటికి తక్కువ ధరకే ఇసుకను సరఫరా చేస్తాం. ఇసుక ధరలను అదుపులో పెట్టి ప్రతి సామాన్యునికి తక్కువ ధరకు ఇసుక అందిస్తాం' అని మంత్రి కెటిఆర్ పలుమార్లు ప్రకటించారు. కానీ క్షేత్రస్థాయిలో పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. ఇసుక మాఫియా కాంట్రాక్టర్ల రూపంలో రాజ్యమేలుతోంది. కాంట్రాక్టర్లు చెప్పిందే వేదం, వాళ్లు ఎంతనుకుంటే అంత దోసుడే. ఈ దోపిడీ గురించి ఎవరైనా ప్రశ్నిస్తే బెదిరింపులు తప్పవు. అధికారులు సైతం కాంట్రాక్టర్లకే వంతపాడుతున్నారు. ఫలితంగా చిన్నచిన్న లారీ యజమానులకు ఇబ్బందులు తప్పడంలేదు.

డబుల్ ధమాక..

ఇసుక క్వారీలలో బడా కాంట్రాక్టర్లు అందినకాడికి దోచుకుంటున్నారు. అందుకు అధికారుల అండదండలు పుష్కలంగా ఉంటున్నాయి. ప్రభుత్వం 35టన్నులకు అనుమతిస్తే లారీలో 70టన్నులను నింపుతున్నారు. రాష్ట్రంలోని జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో కుంట్లం-2, పలుగుల, గుంద్రాజుపల్లి, పలుగుల-9, పలుగుల-10, భద్రాదికొత్తగూడెం జిల్లాలోని కత్తిగూడెం, వీరాపురం, ములుగు జిల్లాలోని అక్కనపెల్లి, మల్లారెడ్డిగూడెం, రాజపేట, కరీంనగర్, జోగులాంబగద్వాల్ జిల్లాలోని అనేక క్వారీల నుంచి హైదరాబాద్‌కు ఇసుకను సరఫరా చేస్తున్నారు. ప్రతిరోజు ఆన్‌లైన్‌లో ఇసుక బుకింగ్ చేసుకుని లారీలలో నగరానికి ఇసుకను తరలిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం 16 టైర్ల లారీలకు 35 మెట్రిక్ టన్నుల ఇసుకను, 14 టైర్ల లారీలకు 32, 12టైర్ల లారీలకు 26 మెట్రిక్ టన్నుల ఇసుకను పాసింగ్ విధానంతో కేటాయిస్తున్నది. అయితే కాంట్రాక్టర్లు, అధికారులు కుమ్మక్కై పాసింగ్ విధానానికి పాతరేస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా 35 మెట్రిక్ టన్నులకు బదులు డబుల్ అంటే 70 మెట్రిక్ టన్నుల ఇసుకను తోడేస్తున్నారు. ఇసుక ద్వారా ప్రభుత్వ ఖజానాకు వస్తున్న ఆదాయానికి అధికారులే గండి కొడుతున్నారు. వేసవికాలంలో రోజుకు 10వేల నుంచి 20వేల వరకు లారీల ద్వారా ఇసుక తరలిస్తున్నారు. కాంట్రాక్టర్లు 35మెట్రిక్ టన్నుల లారీకి రూ.14,300, 32మెట్రిక్‌టన్నుల లారీకి రూ.13,200, 26మెట్రిక్ టన్నుల లారీకి రూ.10,800 చెల్లిస్తున్నారు. కానీ 35మెట్రిక్ టన్నులకు అనుమతి తీసుకుని 70మెట్రిక్ టన్నుల ఇసుకను తరలిస్తున్నారు. ఈ లెక్కన తక్కువలో తక్కువ రోజుకు రూ.10.80కోట్ల ఆదాయానికి గండిపడుతున్నట్టే. అధికారుల నిఘా లేదు. ఇసుక తరలింపులో నియంత్రణే కరువైంది. జయశంకర్‌భూపాలపల్లి, భద్రాదికొత్తగూడెం, ములుగు, కరీంనగర్ జిల్లాలలోని ఇసుక క్వారీల్లో లోడింగ్ పేరుతో రూ.2500 అదనంగా వసూలు చేస్తున్నారు. ఇదేంటని లారీ డ్రైవర్లు ప్రశ్నిస్తే.. మిమ్మల్ని ఎవరు రమ్మన్నారంటూ ఎదురుదాడికి దిగుతున్నారు. వేసవికాలంలో ఎక్కువగా లభ్యమయ్యే సన్న ఇసుక కొరత ఏర్పడింది.